**114వ అధ్యాయం**

# ١١٤ ـ بَابُ بَيَانِ جَوَازِ الشُّرْبِ قَائِماً وَبيَانِ أَنَّ الأَكْمَلَ والأفْضَلَ الشُّرْب قَاعِداً

# పానీయం నించొని త్రాగటం ధర్మసమ్మతమే కాని కూర్చొని త్రాగటం ఉత్తమం

فيه حديث كبشة السابق.

ఇంతకు ముందు వచ్చిన కబ్‌షా (రజి.అన్హా) హదీసును కూడా ఇందుకు నిదర్శనంగా తీసుకోవచ్చు.

٧٦٧ ـ وعن ابن عباس رضي اللهُ عنهما قال: سَقَيْتُ النَّبيَّ ﷺ مِنْ زَمْزَمَ، فَشَرِبَ وَهُوَ قَائِمٌ. متفقٌ عليه.

767. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: నేను దైవప్రవక్త (సల్లం)కు జమ్ జమ్ నీరు త్రాపించాను. ఆయన దాన్ని నించొని సేవించారు.

*(బుఖారీ - ముస్లిం)*

*(సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లింలలోని పానీయాల ప్రకరణం)*

٧٦٨ ـ وعن النَّزَّالِ بنِ سَبْرَةَ رَضيَ اللهُ عنه قالَ: أَتَى عَليٌّ رضيَ اللهُ عنهُ بَابَ الرَّحْبَةِ فَشَرِبَ قائماً، وقالَ: إنِّي رَأَيْتُ رَسولَ اللهِ ﷺ فَعلَ كما رَأَيْتُمُوني فَعَلْتُ. رواهُ البخاري.

768. హజ్రత్ నజ్జాల్ బిన్ సబ్‌రా (రజి) కథనం : ఒకసారి హజ్రత్ అలీ (రజి) బాబుర్రహ్‌బా లోకి (అంటే బహుశా మస్జిద్ ప్రాంగణంలోకి) వచ్చి నించొని నీళ్ళు త్రాగారు. ఆ సందర్భంగా ఆయన "ఇప్పుడు మీరు నేను ఏవిధంగా చేస్తుండగా చూశారో ఆ విధంగా దైవప్రవక్త (సల్లం) చేస్తుండగా నేను చూశాను" అని చెప్పారు. *(బుఖారీ)*

*(సహీహ్ బుఖారీలోని పానీయాల అధ్యాయాలు)*

769. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) కాలంలో మేము నడుస్తూ తినేవాళ్ళం. నించొని నీళ్ళు త్రాగేవాళ్ళం. *(తిర్మిజీ - హసన్, సహీహ్)*

٧٦٩ ـ وعن ابنِ عُمَرَ رضيَ اللهُ عنهما قـال: كنّـا نـأكُـلُ علىٰ عَهْـدِ رسُـولِ الله ﷺ وَنَحْنُ نَمْشي، ونَشْرَبُ وَنَحْنُ قِيَامٌ. رواهُ الترمذي وقال: حديث حسن صحيح.

*(సుననె తిర్మిజీలోని పానీయాల అధ్యాయాలు)*

## ముఖ్యాంశాలు

దైవప్రవక్త అనుచరులు ఎల్లప్పుడూ అలాగే చేసేవారని దీనర్థం కాదు. అనివార్య పరిస్థితుల్లో అప్పుడప్పుడూ ఆ విధంగా చేసేవారని తెలియజెప్పడమే పై హదీసు ఉద్దేశ్యం. ఎందుకంటే రాబోయే హదీసుల్లో నించొని తినటం, త్రాగటం నికృష్టమైన చేష్టలు అని చెప్ప బడింది. కొంతమంది పండితులు ఈ హదీసుల్లోని వారింపును దృష్టిలో పెట్టుకొని నించొని తినడాన్ని, త్రాగటాన్ని అసహ్యకరమైన పద్ధతిగా పేర్కొన్నారు. ఇబ్నె హజర్ (రహ్మాలై) ఈ అభిప్రాయాన్నే ఇష్టపడ్డారు. (ఫత్హుల్ బారీ)

770. హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ తన తండ్రి నుండి ఆయన తన తాతగారి నుండి చేసిన కథనం : దైవప్రవక్త (సల్లం) నించొని మరియు కూర్చొని (రెండు విధాలుగానూ) త్రాగటం నేను చూశాను. (తిర్మిజీ - హసన్, సహీహ్)

٧٧٠ ـ وعن عمرِو بنِ شعيب عن أبيهِ عن جدِّه رضيَ اللهُ عنه قال: رَأَيْتُ رسُولَ اللهِ ﷺ يَشْرَبُ قَائماً وقَاعِداً. رواه الترمذي وقال: حديث حسن صحيح.

*(సుననె తిర్మిజీలోని పానీయాల అధ్యాయాలు)*

771. హజ్రత్ అనస్ (రజి) కథనం : మనిషి నించొని నీళ్ళు త్రాగటాన్ని దైవప్రవక్త (సల్లం) వారించారు.

ఖతాదా (రహ్మాలై) ఇలా తెలిపారు : మేము అనస్ (రజి)ని నించొని తినడం గురించి అడిగాం. అందుకాయన, "అది ఇంకా నీచమైన (లేక) నికృష్టమైన పని" అని అన్నారు. (ముస్లిం)

٧٧١ ـ وعن أَنَسٍ رضيَ اللهُ عنه عن النبيِّ ﷺ أَنَّهُ نَهى أَنْ يَشرَبَ الرَّجُلُ قَائماً. قال قتادة: فقُلْنا لأنَسٍ: فالأكْلُ؟ قالَ: ذلكَ أَشَرُّ ـ أَو أَخْبَثُ ـ. رواهُ مسلم. وفي رواية له: أنَّ النبيَّ ﷺ زَجرَ عَنِ الشُّرْبِ قَائماً.

వేరొక ఉల్లేఖనంలో దైవప్రవక్త (సల్లం) నించొని త్రాగటాన్ని కఠినంగా వారించారని ఉంది.

*(సహీహ్ ముస్లింలోని పానీయాల ప్రకరణం)*

٧٧٢ - وعن أبي هريرةَ رضيَ اللهُ عنه قال: قالَ رسُولُ اللهِ ﷺ: «لَا يَشْرَبَنَّ أَحَدٌ مِنْكُمْ قَائِماً، فَمَنْ نَسِيَ فَلْيَسْتَقِئْ» رواهُ مسلم.

772. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు : మీలో ఎవరూ కూడా సుతరామూ నించొని పానీయం త్రాగరాదు. ఎవరయినా మర్చిపోయి ఆ విధంగా త్రాగితే (త్రాగినదంతా) కక్కేయాలి. *(ముస్లిం)*

*(సహీహ్ ముస్లింలోని పానీయాల ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

మొదట్లో పేర్కొనబడిన హదీసుల్లో నించొని తినటం, త్రాగటం ధర్మసమ్మతమని చెప్పబడింది. అయితే అనివార్య పరిస్థితుల్లో మాత్రమే అలా చెయ్యాలి. సాధ్యమైనంతవరకు కూర్చొనే తినాలి, త్రాగాలి. అదే సరయిన పద్ధతి. ఈ రోజుల్లో కొన్ని కొన్ని చోట్ల విందు భోజనాల్లో నించొని తినే పద్ధతిని అనుసరిస్తున్నారు. ఇలా చేయటం వల్ల జనమంతా ఒకేసారి భోజనం ముగించుకోగలుగుతారని చెబుతారు. కాని దీనివల్ల ఎన్ని నష్టాలున్నాయో, ఈ పద్ధతిని పాటించటంవల్ల ఎన్ని హదీసుల్ని తుంగలో తొక్కినట్లవుతుందో కాస్త ఆలోచించాలి. ఏది ఏమైనా ఈ తరహా భోజన ఏర్పాట్లను నిర్వహించటం ముస్లిం సముదాయానికి మాత్రం శోభాయమానం కాదు.